క్లుప్తంగా

కొండ పరిసరాల్లో చెత్త తొలగింపు



50వ వార్డు కొండ పరిసరాల్లో చెత్త తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మద్దిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధార కొండ వాలు ప్రాంత పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించక పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యపై 'చెత్తమయం' అనే శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు తక్షణం స్పందించారు. కొండ ప్రాంతంలోని చెత్తను పారిశుధ్య సిబ్బంది తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి



అక్కయ్యపాలెం హైవేపై ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు

సీతమ్మధార: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ఫోర్త్ టౌన్ ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అమ్మి నాయుడు అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పెన్ స్కూల్ సౌజన్యంతో గురువారం అక్కయ్యపాలెం జాతీయ రహదారి వద్ద విద్యార్థులతో కలిసి వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇటీవల నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌ల వల్ల వాహన చోదకుల్లో మార్పు వచ్చిందన్నారు. రోడ్డు నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలను సైతం నివారించవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వాణిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయ సేవలకు ప్రశంసలు



గ్రంథాలయంలో పుస్తకాల నిర్వహణను పరిశీలిస్తున్న కృష్ణమోహన్

సీతంపేట: పౌర గ్రంథాలయాన్ని గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రంథాలయ సంచాలకులు ఎ.కృష్ణమోహన్ సందర్శించారు. గ్రంథాలయ పాలకవర్గ కార్యదర్శి డి.ఎస్.వర్మ వివిధ విభాగాలను చూపించి, గ్రంథాలయ ప్రగతిని, పటిష్ట నిర్వహణకు నెలకొల్పిన విధానాలు, సిబ్బంది అంకితభావం గురించి వివరించారు. సంచాలకులు కృష్ణమోహన్ మాట్లాడుతూ గ్రంథాలయంలోని సదుపాయాలు, పోటీ పరీక్షల విద్యార్థులకు కల్పించిన ఆహ్లాదకరమైన వాతావరణం, పరిసరాల నిర్వహణ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. విద్యార్థులు, మహిళలు, కళాకారులు, సాహితీవేత్తలు, యువత ఇలా అన్ని వర్గాల వారి అవసరాలకు తగినట్టు గ్రంథాలయాన్ని తీర్చిదిద్దారని పాలకవర్గాన్ని అభినందించారు. దాతల విరాళాలను సక్రమంగా వినియోగిస్తూ గ్రంథాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుండటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు, గ్రంథపాలకురాలు దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మాంసం విక్రయాలు



మురళీనగర్ మసీద్ జంక్షన్ వద్ద తెరచి ఉన్న చికెన్ షాపు

మద్దిపాలెం: మహావీర్ జయంతి సందర్భంగా మాంసం దుకాణాలు తెరవకూడదని కలెక్టర్ హరేందిర ప్రసాద్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అలా చేసినా, జంతు వధకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కానీ కలెక్టర్ ఆదేశాలను కూడా పక్కన పెట్టి మురళీనగర్ మసీద్ జంక్షన్‌లో యథేచ్ఛగా మాంసం విక్రయాలు కొనసాగించారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలా జరిగిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.



వాహనాలు, తోపుడుబళ్లు నిలిపి ఉంచేందుకు ఉపయోగపడుతున్న 28 బస్టాప్



మందుబాబులకు అడ్డాగా మారిన తాటిచెట్లపాలెం 38 బస్టాప్



తాటిచెట్లపాలెంలో మండే ఎండలో హైవేలో వేచి ఉన్న ప్రయాణికులు

నిరుపయోగంగా.. బస్ షెల్టర్లు

- మందు బాబులకు అడ్డాగా తాటిచెట్లపాలెం హైవే బస్టాప్
- వ్యాపారులకు, పార్కింగ్‌కు ఉపయోగపడుతున్న 28 బస్టాప్
- పూర్తిగా శిథిలావస్థకు చేరిన పోర్ట్ ఆస్పత్రి బస్ బే

తాటిచెట్లపాలెం: అసలే ఎండాకాలం.. ఎండలు మండే కాలం.. ప్రజారవాణా వ్యవస్థ ద్వారా ప్రయాణించాలనుకునే వారికి పరీక్షా కాలం. పోర్టు ఆస్పత్రి, తాటిచెట్లపాలెం, రైల్వేన్యూకాలనీ ఇలా పలు ప్రాంతాల్లో బస్‌లు వచ్చే వరకు వేచి చూసేందుకు బస్‌షెల్టర్లు కాదు కదా కనీసం నీడ కూడా కరువైంది. కొన్ని చోట్ల బస్‌షెల్టర్లు ఉన్నా అవి నిరుపయోగంగానే ఉంటున్నాయి. దీంతో ప్రయాణికులకు ఏమాత్రం ఇవి ఉపయోగపడడం లేదు. ఇంకొన్ని చోట్ల బస్‌షెల్టర్లు ఉన్నా వాటిలో కనిసం కూర్చునేందుకు బెంచీలు కూడా లేని పరిస్థితి. ఎంతసేపైనా నిలబడే ఉండడం లేదా, రోడ్లపైనే కూర్చోవడం చేస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ లక్షల రూపాయలు వెచ్చించి అధునాతన బస్‌షెల్టర్లు నిర్మించింది. ఇవి ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడేవి. కానీ ప్రస్తుత ప్రభుత్వం వీటిని నిర్లక్ష్యం చేసి గాలికొదిలేసింది. సరైన నిర్వహణ లేదు. వాటిలో ఉన్న విలువైన వస్తువులు మాయం అయిపోయాయి. ముఖ్యంగా పోర్ట్ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన బస్ బే పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది.



శిథిలావస్థకు చేరిన పోర్ట్ ఆస్పత్రి బస్ బే

మందుబాబులకు అడ్డాగా 38 బస్టాప్..

తాటిచెట్లపాలెంలో గల గాజువాక నుండి గురుద్వారా వైపు వెళ్లే బస్టాప్ పూర్తిగా నిరుపయోగంగా తయారైంది. వాస్తవానికి హైవేలో బస్‌లు ఆగుతాయి. కానీ హైవేలో ఏ మాత్రం నీడ లేదు. ఎండలోనే ప్రయాణికులు వేచి ఉంటున్నారు. ఇక్కడ ఉన్న బస్టాప్ సర్వీస్ రోడ్డులో ఉంది. అందువల్ల ప్రయాణికులు ఈ బస్‌షెల్టర్‌లోకి రాలేకపోతున్నారు. ఈ బస్‌షెల్టర్‌ను ఆనుకుని ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైన్‌షాప్ తెరచుకుంది. దీంతో సాయంత్రం అయితే ఈ బస్‌షెల్టర్ మందుబాబులకు అడ్డాగా మారిపోతోంది. ఈ పక్కనే వారికి అవసరమయ్యే స్నాక్స్ (స్టఫ్) కూడా అందుబాటులో ఉండడంతో ఇక్కడే చుక్కేసి, బస్‌షెల్టర్‌ను వాడుకుంటున్నారు.



మందుబాబులు తాగిపడేసిన మద్యం బాటిళ్లు

పార్కింగ్‌లా మారిన 28 బస్‌స్టాప్..

తాటిచెట్లపాలెం నుండి కంచరపాలెం వెళ్లే 28 బస్టాప్‌లో ఎప్పుడూ వాహనాలు, తోపుడుబళ్లు మాత్రమే పార్క్ చేసి ఉంటాయి. దీంతో ప్రయాణికులు రోడ్లపైనే బస్‌ల కోసం వేచి చూడాల్సి వస్తోంది.

బస్ షెల్టర్‌లో మందుబాబుల తిష్ట

తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కనే ఉన్న బస్ షెల్టర్ ఏ మాత్రం ప్రయాణికులకు ఉపయోగపడడం లేదు. దీని వెనుకే వైన్ షాప్ ప్రారంభించారు. అప్పటి నుండి ప్రయాణికుల కష్టాలు మరీ తీవ్రమయ్యాయి. షాప్ తెరిచింది మొదలు రాత్రీపగలు తేడా లేకుండా ఇక్కడే మందుబాబులు తిష్ట వేస్తున్నారు. రాత్రయితే మరీ దారుణం.

– ఎస్.లక్ష్మి, తాటిచెట్లపాలెం

వసతులు లేవు

కాంప్లెక్స్ నుండి ఎన్ఏడీ వైపు వెళ్లే బస్‌షెల్టర్‌లో సరైన వసతులు లేవు. ఇక్కడ కుక్కలు, యాచకులు సేదదీరుతుంటారు. దీంతో షెల్టర్‌లోకి వెళ్లాలంటే భయమేస్తుంది. తప్పక రహదారిపైనే నిలబడాల్సి వస్తుంది. అసలే ఎండాకాలం. ఈ షెల్టర్లు ప్రయాణికులకు అందుబాటులో ఉండే విధంగా చూస్తే మంచిది.

– బి.కనకారావు, తాటిచెట్లపాలెం

ఇంతటి నిర్లక్ష్యం తగదు

గత ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ పోర్టు ఆస్పత్రి వద్ద నిర్మించిన బస్ షెల్టర్ పూర్తిగా నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైంది. ఇక్కడ ఉన్న లైట్లు పోయాయి. వైర్లు గాల్లో వేలాడుతున్నాయి. పైన రేకులు పూర్తిగా ఎగిరిపోయాయి. ఎంతో సుందరంగా నిర్మించిన ఈ బస్‌షెల్టర్‌ను పట్టించుకోకుండా వదిలేయడం బాధాకరం.

వి.ఎస్.రావు, కైలాసపురం

మరమ్మతులు చేయాలి

28 బస్టాప్‌లో ఎప్పుడూ ఎవో వాహనాలు, తోపుడుబళ్లు నిలిపి ఉంచుతారు. అసలే ఈ బస్‌షెల్టర్ కనీసం నిల్చునేందుకు కూడా వీలు లేకుండా శిథిలావస్థలో ఉంది. వెంటనే దీనిని బాగుచేసి, ఇక్కడి నుండి వాహనాలను తొలగించి, ప్రయాణికులకు అవసరమైన బెంచీలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– మహేష్, రైల్వేన్యూకాలనీ

విప్లవోద్యమాల చైతన్య దీప్తి 'కానూరి'



మాట్లాడుతున్న కవి సిరికి స్వామినాయుడు

సీతంపేట: కళాకారుడు ప్రజాపక్షం వహించాలనే నిబద్ధత కామ్రేడ్ కానూరి గళంలో కనిపిస్తుందని కవి సిరికి స్వామినాయుడు అన్నారు. ప్రజా కవి కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు పదో వర్ధంతి సభ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతికోద్యమ నేత, విప్లవోద్యమాల చైతన్య దీప్తి కానూరి అని కొనియాడారు. ప్రజాకళలకు పురుడు పోసి అరుణోదయాన్ని భావితరాలకు అందించిన ఆయన స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఒక తరం అనుభవాలను మరో తరానికి అందించడానికి కానూరి వర్ధంతి సభ నిర్వహించడం అభినందనీయమన్నారు. అరుణోదయ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలోని ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ మూలాలపై దాడి చేస్తూ ఒకే దేశం, ఒకే చట్టం పేరుతో వివిధ జాతులు, మతాల ఆచార, సంప్రదాయాలను నాశనం చేస్తోందని ఆరోపించారు. జాతీయ భాష పేరుతో ప్రాంతీయ భాషల అస్థిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చుతున్నారని మండిపడ్డారు. ప్రజాకవి కానూరి పట్టుదల, నిబద్ధత అలవర్చుకుని కళాకారులు ప్రజల పక్షాన ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అరుణోదయ కళాకారులు ఆలపించిన పాటలు సభికులను ఉత్తేజపర్చాయి. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు, సీపీఐ ఎంఎల్ నాయకుడు వై.కొండయ్య, ఇఫ్టూ నాయకుడు కె.వెంకటేశ్వర్లు, భారత నాస్తిక సమాజం కన్వీనర్ సారయ్య పాల్గొన్నారు.

పిల్లలకు సత్వర వైద్య సేవలందించండి



పిల్లల తనిఖీ గదిలో వైద్య సేవలను పరిశీలిస్తున్న గొండు సీతారామ్

సీతంపేట: కంటి చూపు సమస్యలతో ఆస్పత్రికి వచ్చే పిల్లలకు సత్వర వైద్య సేవలందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ సూచించారు. బుల్లయ్య కళాశాల రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలను గురువారం ఆయన సందర్శించారు. కమిషన్ ఆదేశాలలో జనవరిలో కంటి ఆస్పత్రిలో పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపీ, తనిఖీ గది, శస్త్ర చికిత్సల వార్డులను సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి, ఇన్‌చార్జి ఆర్ఎంవో వాసుపల్లి శ్రీలక్ష్మితో కలిసి పరిశీలించారు. రోజూ పిల్లల ఓపీ ఎంత వస్తోంది, వారికి క్యూలైన్‌తో సంబంధం లేకుండా వైద్య సేవలు అందిస్తున్నారా తదితర విషయాలను పిల్లలను, వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. చికిత్స కోసం వచ్చే పిల్లలకు ప్రత్యేక ఓపీ, ప్రత్యేక తనిఖీ గదిలో సేవలందించి త్వరితగతిన పంపించే ఏర్పాట్లు పూర్తి స్థాయిలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పిల్లల కోసం ప్రత్యేక ఓపీ, తనిఖీ గది ఉన్నట్టు అందరికీ తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రత్యేక ఓపీ, చికిత్స సేవలపై అందరికీ తెలిసేలా చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి తెలిపారు. ఆస్పత్రి వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా రాంగ్ రూట్ ప్రయాణాలు



నక్కవానిపాలెం మెయిన్ రోడ్డు మీద రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం – సీతమ్మధార మెయిన్ రోడ్డు జంక్షన్‌లో రాంగ్ రూట్ ప్రయాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ కేఆర్ఎం కాలనీ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలుండగా.. ఎదురుగా ఉన్న నక్కవానిపాలెం మెయిన్ రోడ్డు మీద రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. స్థానిక ఏఎంజీ ఆస్పత్రి మీదుగా వచ్చే వాహనాలు టీపీటీ కాలనీ మీదుగా గురుద్వారా చేరుకునేందుకు తరచూ రాంగ్ రూట్‌లో వెళ్తున్నాయి. ఈ మార్గం నిత్యం వాహనాలు, పాదచారులతో రద్దీగా ఉంటుంది. ఈ రహదారిలోనే 69 నంబర్ సిటీ బస్సులు, సీతమ్మధార రైతుబజార్ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. మరోవైపు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో కార్లు, ఆటోలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ ప్రాంతంలో పార్లర్లు, నూడిల్స్, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు అధిక సంఖ్యలో ఉండటంతో వాహనాల రద్దీ అధికంగానే ఉంటుంది. నక్కవానిపాలెం మెయిన్ రోడ్డులో రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాల కారణంగా వెనుక నుంచి వచ్చే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి రాంగ్ రూట్ ప్రయాణాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

13న పార్కిన్‌సన్స్ వ్యాధిపై అవగాహన



సమావేశంలో పాల్గొన్న శ్రీనివాసరాజు తదితరులు

మురళీనగర్: వాకర్స్ హెల్త్ క్లబ్ 20వ వార్షికోత్సవంలో భాగంగా సిప్లా సంస్థ సౌజన్యంతో వరల్డ్ పార్కిన్‌సన్స్ డే నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరాజు తెలిపారు. మురళీనగర్ హరిత పార్కులో గురువారం లోగోతో కూడిన టీ–షర్ట్‌లను వాకర్స్ సమక్షంలో ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 13న హరిత పార్కు ప్రాంగణంలో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు న్యూరాలజిస్ట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పార్కిన్‌సన్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ సదస్సులో పాల్గొనదలచిన వారు 81060 22672, 98484 33170, 96662 62750 నంబర్లలో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వీరికి సిప్లా సంస్థ తరఫున టీ–షర్ట్‌లు, క్యాప్‌లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్, హరిత పార్కు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు పి.కొండలరావు, కార్యదర్శి ధరిమిరెడ్డి దేముడు, కోశాధికారి బి.కిశోర్, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ కార్యదర్శి మహేశ్వరరావు, సలహాదారు సిహెచ్.విజయప్రసాద్, డైరెక్టర్ బి.అప్పలసూరి, సిప్లా కో–ఆర్డినేటర్ కొండబాబు, యూనివర్సల్ యూత్ వాకర్స్ అధ్యక్షుడు వంశీ చింతలపాటి తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సీతమ్మధార: త్రయోదశి సందర్భంగా సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో కొలువైన రామలింగేశ్వర స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, భక్తుల గోత్ర నామాలతో విశేష పూజలు చేశారు. స్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తిశ్రద్ధలతో భక్తులు దీపాలు వెలిగించారు.

అభాగ్యుడికి ఆశ్రయం



షెల్టర్‌లో సత్యనారాయణ

సీతమ్మధార: నర్సీపట్నానికి చెందిన సత్యనారాయణ (64)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే కుటుంబ సభ్యులు అతన్ని పట్టించుకోకపోవడంతో అనాథలా రోడ్ల మీద తిరుగుతున్నాడు. గురువారం ఏయూటీడీ సిబ్బంది ఫీల్డ్ సందర్శనలో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ బస్ బే దగ్గర అతన్ని గుర్తించారు. అతని వివరాలు తెలుసుకుని షెల్టర్‌లో అతనికి ఆశ్రయం కల్పించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

సీతమ్మధార: శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుద్వారా జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. సీపీ మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల శరీరం నుంచి నీరు, లవణాలు తగ్గిపోకుండా మంచినీరు ఎక్కువగా తాగాలని, వేసవిలో ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. చలివేంద్రం నిర్వాహకులను సీపీ అభినందించారు.

మెయిన్ రోడ్డుపై రాంగ్ పార్కింగ్

- సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ట్రాఫిక్ కష్టాలు



సీతమ్మధార మెయిన్ రోడ్డు మీద పార్క్ చేసిన ప్రైవేట్ స్కూల్ బస్సులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార దరి నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి. ఇక్కడ ఒకవైపు బాలయ్యశాస్త్రి లేఅవుట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు ఉండగా.. ఎదురుగా ఉన్న నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీ, రాధాకృష్ణా లే అవుట్ ప్రాంతాల్లో మెయిన్ రోడ్ల మీదే వాహనాలను రాంగ్ పార్కింగ్ చేస్తున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి ఓ ప్రైవేట్ పాఠశాలను ఆనుకుని ఉన్న ప్రధాన రహదారిపై మూడు నుంచి ఆరు వరకు విద్యార్థులు వచ్చే స్కూల్ బస్సులను ఒకదాని వెంట మరొకటి నిలిపి ఉంచుతున్నారు. బస్సుల పార్కింగ్ కారణంగా యూ టర్న్ తిరిగే వాహన చోదకులకు ప్రమాదాలు తప్పడం లేదని స్థానికులు చెబుతున్నారు. పాఠశాల ప్రారంభం, విడిచి పెట్టేటప్పుడు సీతమ్మధార మెయిన్ రోడ్డులో ఎక్కడి ట్రాఫిక్ అక్కడే నిలిచిపోవడంతో వాహన చోదకులు అదే పనిగా హారన్లు మోగించడం రివాజుగా మారింది. మరోవైపు ఈ మార్గంలో పైప్‌లైన్ పనుల కోసం రోడ్లు తవ్వేయడంతో ధూళిమయంగా తయారైంది.

ఇక్కడి షాపింగ్ కాంప్లెక్స్, దుకాణాల ఎదుటనే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు యథేచ్ఛగా పార్కింగ్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ మార్గంలోని బ్యాంకులకు, వాణిజ్య సముదాయాలకు వచ్చే వినియోగదారులు సెల్లార్‌కు బదులుగా రోడ్డు మీదే వారి వాహనాలను పార్క్‌చేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. నార్త్ ఎక్స్‌టెన్షన్ మెయిన్ రోడ్డు మీదే వాహనాలు పార్క్‌చేసి వదిలేస్తున్నా.. ద్వారకా ట్రాఫిక్ పోలీసుల జాడ లేదని స్థానికులు, పాదచారులు విమర్శిస్తున్నారు. సీతమ్మధారలోని నార్త్ ఎక్స్‌టెన్షన్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, రాధాకృష్ణా లేఅవుట్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో రాంగ్ పార్కింగ్‌ను నిరోధించి, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం ఉద్యమిద్దాం



అంబేడ్కర్ జయంతి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో నూతనంగా ఎన్నికైన సొసైటీ కమిటీని పరిచయం చేసి, అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమానత్వం, స్వేచ్ఛ కోసం నిర్మితమైన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు తమ సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తూ భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని విక్రయిస్తూ ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి లేకుండా రిజర్వేషన్లకు దూరం చేసే పన్నాగం పన్నుతున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ నెల 14న సొసైటీ ఆధ్వర్యంలో బి.ఆర్.అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి జి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు అలమండ ప్రసాద్, సహాయ కార్యదర్శులు బత్తుల గౌతం, పతివాడ రాంబాబు, చిరంజీవి, రాజాన సరస్వతి, అప్పారావు, ఎస్.రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మర్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ సెక్రటరీ

తాటిచెట్లపాలెం: రైల్వేన్యూకాలనీలోని జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు సమ్మర్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ నెల 3 నుంచి 13 వరకు ఈ క్యాంప్ కొనసాగుతుంది. ఒకేషనల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ట్రేడ్‌లో క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సన్యాసిరావు తెలిపారు. 10వ తరగతికి చెందిన 20 మంది విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ సహకారంతో 17 విభాగాల్లో ఒకేషనల్ కోర్సులపై అవగాహన కల్పిస్తున్నారు. ఇంటర్నెట్ వినియోగం, సామాజిక మాధ్యమాలపై అవగాహన, సచివాలయాల్లో అందుతున్న పౌరసేవలు, బ్యాంకుల్లో ఆర్థిక లావాదేవీల వంటి అంశాల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అధ్యాపకురాలు కేఎస్‌పీ ప్రశాంతి పర్యవేక్షణలో శిక్షణ ఇస్తున్నట్లు హెచ్ఎం తెలిపారు.

● శిరస్త్రాణం.. రక్షణ కవచం



సత్యం జంక్షన్‌లో డివైడర్ తగిలి ద్విచక్ర వాహనం పైనుంచి రోడ్డుపై మహిళలు పడిపోయారు. అయితే హెల్మెట్ ధరించడం వల్ల వాహనం నడుపుతున్న ఆమె పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇదిలా ఉండగా.. పక్కనే హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహన చోదకుడిని గమనించవచ్చు.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం